క్లుప్తంగా

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(సెంట్రల్) : ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో అనుమసముద్రం పేట మండల పార్టీ నాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో రాబోయే ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టినట్లు వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఆలయాల మరమ్మతులకు రూ.5 లక్షల చొప్పున విడుదల చేశామని, దీనిని సద్వినియోగం చేసుకుని ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

మహాసభలను జయప్రదం చేయండి


ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో ఈనెల 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న 25వ సీపీఎం నగర మహాసభలను జయప్రదం చేయాలని బాలాజీనగర్‌లో ఆ పార్టీ నేతలు గురువారం ప్రచారం నిర్వహించారు. సీపీఎం 15వ డివిజన్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ గడిచిన మూడు సంవత్సరాల కాలంలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో చేపట్టనున్న ఉద్యమాలను రూపొందించేందుకు మహాసభలో తీర్మానం చేస్తామన్నారు. బాలాజీనగర్‌లోని కాలువకట్టపై నివాసం ఉండే ప్రజలకు శాశ్వతమైన ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 40 ఏళ్ల క్రితం ఇళ్ల నిర్మాణానికి తీసుకున్న రుణాలను ఇప్పుడు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. అక్టోబర్ 21న సాయంత్రం 4 గంటలకు పూలే విగ్రహం సెంటర్ నుంచి నిర్వహించే భారీ ప్రదర్శన, బాలాజీనగర్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సూర్యనారాయణ, అల్లంపాటి శ్రీనివాసులురెడ్డి, మస్తాన్‌బీ, నాగేశ్వరరావు, రమణారెడ్డి, సుబ్బమ్మ, మల్లి, హరి, మహేష్, బాలాజీసింగ్, తిరుపతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో బాడీ చెకప్ సేవలు

నెల్లూరు (టౌన్) : నారాయణ ఆస్పత్రిలో హోల్ బాడీ చెకప్ సేవలను ప్రారంభించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని నారాయణ ఆస్పత్రిలో గురువారం హెల్త్ చెకప్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.12 వేలు ఖరీదు చేసే వైద్య పరీక్షలను రూ.4999లకే అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు ముందస్తు పరీక్షలు చేయించుకోవాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 30 రకాల వైద్య పరీక్షలతో పాటు డాక్టర్ల కన్సల్టేషన్‌తో కలిపి హెల్త్ చెకప్‌ను రూపొందించారన్నారు. నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ అజయ్‌రెజినాల్డ్ అకడమిక్ డీన్ శివకుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్ కాంత్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీని ఏర్పాటు చేస్తాం

నెల్లూరు రూరల్ : జిల్లా కుమ్మర శాలివాహన సంఘానికి సంబంధించిన నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని ఆ సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ నరసయ్య, రాష్ట్ర వర్కింగ్ జనరల్ సెక్రటరీ భాస్కర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు వారు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, ప్రకటించారు.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

పని ఒత్తిడి, కుటుంబ బాధ్యతల్లో నిరంతరం సతమతమయ్యే మహిళలు తమ ఆరోగ్యంపై తగిన దృష్టి పెట్టలేరు. ఫలితంగా చర్మ వ్యాధులు వస్తుంటాయి. ఈ క్రమంలో వారి ముఖ, చర్మ సౌందర్యాన్ని పెంపొందించేలా వాడవాడలా బ్యూటీపార్లర్లు వెలుస్తున్నాయి. దీని ద్వారా పలువురు ఆర్థిక స్వావలంబన పొందడమే కాకుండా, మహిళలకు ధీమా కల్పిస్తున్నారు.

- మహిళల అందాలకు మెరుగులు దిద్దుతున్న బ్యూటీపార్లర్‌లు
- స్వయం ఉపాధికి అవకాశం


ఫేషియల్ చేస్తున్న బ్యూటీషియన్

నెల్లూరు సిటీ : ప్రస్తుత ఫాస్ట్ కల్చర్‌లో సులువు పద్ధతిలో తక్కువ సమయంలో ముఖాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు బ్యూటీపార్లర్లు అందుబాటులో ఉన్నాయి. యువతుల నుంచి 50 ఏళ్లు నిండిన వారు కూడా బ్యూటీపార్లర్లకు క్యూ కడుతున్నారు. దీంతో నగరంలో పార్లర్‌లు వేగంగా పుట్టుకొచ్చాయి. నెల్లూరు నగరంలో మొత్తం సుమారు 500 పార్లర్లు ఉన్నాయి. జావిద్ హబీబ్, వీఎల్‌సీసీ, కలర్స్, గ్రీన్‌ట్రెండ్స్, నేచురల్స్, ఆర్–2, అనూస్ మొదలైనవి ప్రధానమైన బ్యూటీ పార్లర్లు. ఎక్కువగా మహిళలు ఇళ్లలోనే బ్యూటీపార్లర్లను నిర్వహిస్తున్నారు. గోళ్లను కట్ చేయడం మొదలుకుని ఐబ్రోస్ కటింగ్, ఫేషియల్స్, హెయిర్ కట్స్, హెయిర్ కలర్స్ ఇలా బ్యూటీ పార్లర్‌లు అందుబాటులో ఉంచాయి.

20కి పైగా ఫేషియల్స్

ప్రతి ఒక్కరిలో చర్మ స్వభావం వేరువేరుగా ఉంటుంది. ఆయిల్ ఫేస్ ఉన్నవారికి ఒకరకంగా, పొడి ముఖం ఉన్న వారికి మరో రకంగా ఫేషియల్స్ చేయాల్సి ఉంటుంది. వారి చర్మానికి తగ్గట్టుగా క్రీమ్స్‌ను వినియోగిస్తుంటారు. ఇలా మొత్తం 20 రకాలకుపైగా ఫేషియల్స్ అందుబాటులో ఉంచారు. హెర్బల్ ఫేషియల్, ఫ్రెష్ ఫ్రూట్ ఫేషియల్, యాంటీ టేనీ ఫేషియల్, పిగ్మెంటేషన్ ఫేషియల్, గోల్డ్ ఫేషియల్, డైమండ్ ఫేషియల్, సిల్వర్ ఫేషియల్, ఆరోమా ఫేషియల్, విటమిన్–సీ ఫేషియల్స్ చేస్తున్నారు. వీటికి అయ్యే ఖర్చు రూ.500 మొదలుకుని రూ.2 వేలు వరకు ఉంటుంది.

ఫంక్షన్‌లకు ప్రత్యేక ప్యాకేజీలు

వివాహాలు, పుట్టిన రోజులు తదితర ఫంక్షన్‌లకు వెళ్లే ముందు కొందరు మహిళలు తప్పనిసరిగా బ్యూటీపార్లర్‌లకు వెళ్లడం పరిపాటిగా మారింది. ఫంక్షన్‌లలో తమ అందాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పార్లర్‌లకు వెళ్తున్నారు. దీంతో పార్లర్ నిర్వాహకులు ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉంచారు. కస్టమర్ వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఎంగేజ్‌మెంట్ మేకప్, బ్రైడల్ మేకప్, రిసెప్షన్ మేకప్, పార్టీ మేకప్, గరల్స్ పార్టీ మేకప్ వంటి ప్యాకేజీలు ఉన్నాయి. వీటికి రూ.5 వేలు నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది.

జాగ్రత్తలు తీసుకోవాలి



కస్టమర్ చర్మానికి తగ్గట్టు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ఫేషియల్స్ చేయాల్సి ఉంది. కస్టమర్‌ల చర్మం ఏ విధంగా ఉందో ముందు గుర్తించిన తరువాతే ఏ ప్రొడక్ట్‌ను వినియోగించాలో నిర్ణయం తీసుకుంటాం. తరువాతే వారికి తగ్గట్టుగా ఫేషియల్స్ చేస్తుంటాను.
– వాసంతి, నవాబుపేట, బ్యూటీషియన్

ఫంక్షన్‌లకు ప్రత్యేకంగా..



నా స్నేహితులతో కలిసి వివాహాలు, ఇతర ఫంక్షన్‌లకు ప్రత్యేకంగా ఫేషియల్స్‌ను చేస్తాం. అదే విధంగా ఇతర ఫంక్షన్‌లకు కూడా ఫేషియల్స్, హెయిర్ కటింగ్‌లు చేస్తాం. ఈ రోజుల్లో ప్రతిఒక్కరూ బ్యూటీపార్లర్‌కు వెళ్తున్నారు. తాము ఇంటి వద్ద నుంచే చేస్తున్నాం.
– మౌనిక, రామ్మూర్తినగర్, బ్యూటీషియన్

తప్పులను సవరించాలి



నెల్లూరు (టౌన్) : సచివాలయ ఏఎన్‌ఎంల పదోన్నతుల్లో విడుదల చేసిన జాబితాలో జాయినింగ్ తేదీ, ర్యాంకింగ్‌లు కొన్ని తప్పులుగా పొందుపరిచి ఉందని, వాటిని సవరించాలని ఏపీ హంస జిల్లా మహిళా విభాగం కార్యదర్శి సుకన్య తెలిపారు. ఈ మేరకు జీజీహెచ్‌లో గురువారం డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిమార్కుల కాలంలో వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు సంబంధించినవి సరైన ఆర్డర్లలో అప్‌డేట్ చేయాలన్నారు. దీనిపై స్పందించిన డీఎంహెచ్ఓ పెంచలయ్య పదోన్నతుల విషయంలో సచివాలయ ఉద్యోగులకు సరీ్వసు పరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా సవరించి పదోన్నతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏపీ హంస గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ చాముండేశ్వరి, రూరల్ కార్యదర్శి ఉమామహేశ్వరి, ఇంద్రజ, సురేఖ, సుమతి పాల్గొన్నారు.

ఆరుగురు సిబ్బందికి నోటీసులు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని 48, 1, 5 డివిజన్లలో విధులు నిర్వర్తిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముగ్గురు, శానిటరీ సెక్రటరీలు ముగ్గురు మొత్తం ఆరుగురికి నోటీసులు సిద్ధం చేసినట్లు సమాచారం. విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో వారిపై చర్యలకు మంత్రి నారాయణ గురువారం ఆదేశించారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోనున్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



నెల్లూరు(క్రైమ్) : రూరల్ మండలం కొత్తూరులోని నెహ్రూ వృద్ధుల ఆశ్రమంలో జిల్లా సబ్‌జైల్స్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తన పుట్టినరోజు వేడుకలను గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడున్న వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఆరోగ్య కేంద్రంలో తనిఖీ


బీసీజీ వ్యాక్సినేషన్ను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని రామతీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఖాదర్‌వలీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్, టీబీ ఎగ్జామినేషన్స్, టీబీ, లెప్రసీ, సీజనల్ వ్యాధుల గురించి పలు రికార్డులను పరిశీలించారు. నెలవారీ కాన్పుల వివరాలు, ఆరోగ్య ఆసరా, ఆరోగ్యశ్రీ వివరాలు తెలుసుకుని వైద్యులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం పాతూరులో జరిగే అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రామతీర్థం ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్, జిల్లా పీఎండీటీ అండ్ టీబీ, హెచ్ఐవీ కో–ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక విషయాలను బోధించాలి

నెల్లూరు (టౌన్) : పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రకృతి, సమాజం వంటి మౌలిక విషయాలను బోధించాలని ఏఐడీఎస్‌ఓ నగర కార్యదర్శి త్రినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ నైపుణ్య కోర్సులను ఆరో తరగతి నుంచే ప్రవేశపెట్టాలనే రాష్ట్ర ప్రతిపాదనలు విద్యా లక్ష్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. పదో తరగతి వరకు జ్ఞానార్జన, భాషలు, వ్యక్తిత్వ నిర్మాణం తప్ప ఏమీ ఉండరాదన్నారు.

మరమ్మతులు చేయరూ..


పొదలకూరు రోడ్డు దుస్థితి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు నగరంలోని పలు ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. పొదలకూరు రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారి వర్షాల కారణంగా మరింత దెబ్బతింది. రోడ్డుపై గుంతలు పడి కంకర బయటకు వచ్చింది. అటువైపుగా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.
– నెల్లూరు(క్రైమ్)


రహదారిపై పడిన గుంతలు


గుంతల్లో చేరిన నీరు

సమష్టి కృషితో సమర్థవంతమైన సేవలు

- కమిషనర్ సూర్యతేజ


ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందుకున్న వారితో కమిషనర్ సూర్యతేజ, హెల్త్ ఆఫీసర్ చైతన్య

నెల్లూరు(బారకాసు) : గత మూడు రోజులుగా నగర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారుల సమష్టి కృషితో సమర్థవంతమైన సేవలు అందించారని కమిషనర్ సూర్యతేజ అన్నారు. అన్ని విభాగాల అధికారులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో సహాయక చర్యల్లో పాల్గొని జనజీవనానికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ విపత్తును దీటుగా ఎదుర్కొన్నామని కమిషనర్ తెలియజేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి, పునరావాస కేంద్రాలకు తరలించి సంరక్షించే ప్రక్రియను ఆశించిన స్థాయిలో పూర్తి చేశామన్నారు. అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ లేకుండా నిరంతరం మోటార్ల సహాయంతో తోడివేస్తూ వాహనచోదకులు అసౌకర్యానికి గురవకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కొన్ని డివిజన్లలో ఇప్పటికీ కొన్ని డ్రెయిన్ కాలువలు, ప్రధాన పారుదల కాలువల్లో జేసీబీల సహాయంతో పూడికతీత పనులను కొనసాగిస్తూనే ఉన్నామని, నగర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.

నలుగురు మేస్త్రీలకు పదోన్నతి

నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలుగా విధులు నిర్వహిస్తున్న దారా జయకుమార్, వి.శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులుకు హెల్త్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ సూర్యతేజ గురువారం ఉత్తర్వులు అందజేశారు. విధుల నిర్వహణలో మెరుగైన ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం


శంకరమఠంలో జరుగుతున్న చండీహోమం

నెల్లూరు(బృందావనం) : అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా ఆయత్తు చంద్రశేఖర్ ప్రభు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్– ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి


ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావుతో విద్యార్థులు

నెల్లూరు (టౌన్) : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు రావాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తెలిపారు. డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా కాకుటూరులోని జైన్ దేవాలయం, జిల్లా విజ్ఞాన ప్రదర్శన శాల, మ్యూజియం, యూనివర్సిటీ తదితర ప్రాంతాలను గురువారం పర్యటించారు. వర్సిటీలో సేంద్రియ వ్యవసాయం, తేనెటీగల పెంపకం, చెత్త నుంచి కంపోస్టు తయారు చేయడం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడతూ సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం ద్వారా పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటసుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ కరుణకుమారి, సభ్యులు పూర్ణచంద్రకుమారి, విజయలక్ష్మి, హాస్టల్ సూపర్‌వైజర్ యమున పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని షాదీ మంజిల్‌లో అన్ని సౌకర్యాలను కల్పిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని కోటమిట్టలో ఉన్న షాదీ మంజిల్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షాదీ మంజిల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తానని పేర్కొన్నారు.

పరిశీలన

నెల్లూరు నగర పరిధిలోని పెన్నా పరీవాహక ప్రాంతాల్లో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి నారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మరో రెండు కొత్త రీచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

మానవతా విలువలను పెంపొందించుకోవాలి


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్


వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెప్మా పీడీ రవీంద్ర

నెల్లూరు(క్రైమ్) : రామాయణం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రామాయణం రచించిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని తెలిపారు. ఉన్నతమైన ఆదర్శభావాలను బోధించే మధుర కావ్యం రామాయణమని కీర్తించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, ఎస్‌బీ, ఏఆర్, డీటీసీ డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, గిరిధర్‌రావు, ఏఓ చంద్రమౌళి, డీసీఆర్‌బీ, డీటీసీ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌లు టీవీ సుబ్బారావు, నాగేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయంలో..

నెల్లూరు(బారకాసు) : వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం నగరంలోని సుబేదారుపేటలో ఉన్న మెప్మా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పీడీ రవీంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శాలను రామాయణం మనకు బోధిస్తుందన్నారు. అలాంటి గొప్ప కావ్యాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి అని చెప్పారు. రామకావ్యం వెలుగుల్లో మానవాళి సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అందరికీ వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, ఎస్‌ఎస్ కాంతయ్య, బీఎల్ హర్షిత, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, రుక్సాన, సిబ్బంది జరీనా, షాకీర్, సీఓలు పాల్గొన్నారు.

రవాణాశాఖ కార్యాలయంలో..

నెల్లూరు (టౌన్) : స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీసీ చందర్, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, బాబు, ఏఓ రామ్మోహన్, ఏఎంవీఐలు స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో..

స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీఈఓ పీవీజే రామారావు, ఏడీలు, సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రవాణాశాఖ కార్యాలయంలో..


విద్యాశాఖ కార్యాలయంలో..